క్లుప్తంగా

టెలిఫోన్ స్తంభంతో పొంచి ఉన్న ప్రమాదం



అనపర్తి పాత ఊరిలో నడి రోడ్డుపై ఉన్న టెలిఫోన్ స్తంభం

అనపర్తి : రాజానగరం, పెదపర్తి ప్రధాన రహదారి పై సగం తొలగించిన టెలిఫోన్ స్తంభం వల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే పాత ఊరు మసీద్ సెంటర్‌లో సీసీ రోడ్డుపై సుమారు అడుగు మేర పైకి ఉన్న ఈ ఇనుప పైపు పై ఇప్పటికే పలువురు పడి గాయాల పాలయ్యారని పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని ఈ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు 13 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో 13 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం జరిగిన మ్యాథ్స్–1ఏ, బోటనీ–1, సివిక్స్–1, బయోకెమిస్ట్రీ–1, పరీక్షలకు మొత్తం 346 మంది హాజరుకావాల్సి ఉండగా 333 మంది, మధ్యాహ్నం జరిగిన మ్యాథ్స్–2ఏ, బోటనీ–2, సివిక్స్–2, పరీక్షలకు మొత్తం 38 మంది హాజరుకావాల్సి ఉండగా 35 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం



పందలపాకలో వీరభద్రుడు సంబరం చేస్తున్న గొర్రిపోటి కుటుంబ సభ్యులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని వీరభద్రుడు సంబరం వైభవంగా నిర్వహించారు. బుధవారం గొర్రిపోటి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గుల్లిపల్లి, కత్రి, యాసలపు, కొటాని, లగుడు, వంశీకులకు వీరభద్రుడు సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు, బంధు మిత్రులు సందడి వాతావరణ నెలకొంది. వీరభద్రుడు ముందుగా గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలోని కుటుంబ సభ్యులు, మహిళలు ,గ్రామస్తులు, భారీ ఎత్తున్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని గొర్రిపోటి వెంకటరమణ, అరుణ దంపతులు తదితరలు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి



యూనివర్సిటీలో మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

రాజానగరం: దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి, దేశభక్తుడు మురళీనాయక్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అశువులు బాసిన మురళీనాయక్ ఫ్లెక్సీని యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసి, బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వెళ్లకుండా దేశ రక్షణ కోసమే తన జీవితమని చాటిచెప్పిన ఆయన త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కోరుకొండ: స్థానిక సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెస్ట్ గానుగూడెం, జంబూపట్నం, కోరుకొండ, కాపవరం, శ్రీరంగపట్నం, మునగాల, కోటి, కోటికేశవరం, బొల్లెద్దులపాలెం, గాదరాడ, కణుపూరు, రాజవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీఆర్‌టీయూ సమావేశం

కోరుకొండ: గ్రామంలో పీఆర్‌టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. మండలశాఖ నూతన అధ్యక్షులుగా ఎం.శివన్నారాయణ, ప్రధానకార్యదర్శిగా ఎస్.రాజులను సమావేశం ఎన్నుకుంది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పల్ల రాజారావు, ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొరికినంత దోచుకో..



నర్సాపురం రామస్వామి చెరువులో మట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు
- భారీ వాహనాలతో రవాణా
- 25 టన్నుల లోడ్‌తో తరలింపు
- రెండు చెరువులకు అనుమతి ఉంటే పది గ్రామాల్లో తవ్వకాలు

కోరుకొండ: గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతోంది. కొండలను పిండేస్తున్నారు. చెరువులను గుల్ల చేస్తున్నారు. కూటమి నాయకుడల అండదండలు చూసుకుంటూ అక్రమార్కులు దొరికినంత దోచుకుంటూ జేబులు నింపుకొంటున్నారు. మెట్టప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో మట్టి, గ్రావెల్ ఇష్టమొచ్చినట్టు తవ్వుకుంటున్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టి తవ్వేసి అమ్ముకుంటున్నారు. రాత్రి వేళల్లో కూడా వదలడం లేదు. ప్రతిరోజు రాత్రి వేళల్లో 300 నుంచి 500 లారీల రవాణా జరుగుతోంది.



మట్టిని రవాణా చేస్తున్న భారీ వాహనాలు

నిర్వాహకులు కొందరైనా కర్త ఒక్కరే..

నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్, చెరువులు తవ్వకాలు జరుగుతున్నాయి. మట్టిని తవ్వి ఆ మట్టిని కాజేస్తోంది కొందరు వ్యక్తులైతే. దీనికి కర్త మాత్రం ఒక్కరేననే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గానికి ప్రథమ పౌరుడైన ఆ వ్యక్తి అనతికాలంలోనే సొమ్ము చేసుకోవాలన్న లక్ష్యంతో గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతోంది. ఈ విధంగా వ్యవహరిస్తే ప్రకృతిపరంగా ఏర్పడిన సంపద మొత్తం నాశనమవుతోందని ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

అంతరిస్తున్న కొండలు

మండలంలోని కోటికేశవరం–నల్లగొండ మధ్యలోని కొండలను రాత్రి వేళల్లో తవ్వేస్తున్నారు. ఇక్కడి నుంచి రోజూ 25–50 లారీల రవాణా జరుగుతోంది. దీంతో అక్కడి రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయి. మునగాల కొండ సగమే మిగిలింది. కాపవరం వద్ద కొండకు కోతలు పెరుగుతున్నాయి. కణుపూరులోని మల్లికార్జునస్వామి వారి కొండను సైతం దోచుకున్నారు. ఇక్కడి కొండ సగభాగాన్ని తవ్వేయడంతో కొండరూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికీ అనుమతులు లేకుండా అక్రమ రవాణా జరుగుతోంది. గాధరాడలోని పుష్కర, పోలవరం కాలువల మట్టిని కూడా దోపిడీకి గురైంది.



కోటికేశవరం–నల్లగొండ మధ్య తవ్వేస్తున్న కొండ

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పట్ట పగలే అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మండలంలోని రెండు చెరువులకు అనుమతులు తీసుకుని, 10 గ్రామాల్లో మట్టిని తవ్వుతున్నారు. శ్రీరంగపట్నం, రాఘవపురం, కోటికేశవరం, నర్సాపురం, కణుపూరు, రాజవరం, బుచ్చెంపేట, బొల్లెద్దుపాలెం, గాధరాడ గ్రామాల్లోని మట్టిని తవ్వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూడు అడుగులుండాల్సిన లోతు 5 నుంచి 8 అడుగులు వరకూ ఉంటోంది. లారీల్లో 18 టన్నులకు బదులుగా 22 నుంచి 25 టన్నులు లోడింగ్ చేస్తున్నారు. దీనిని రూ.10,000 నుంచి రూ.25,000 విక్రయిస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్, వాహనాల భద్రత విషయమై ఆర్టీవో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంలో ఈ అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

కూటమి నేతల అండదండలు



గ్రావెల్, మట్టి తవ్వకాలు, రవాణా విషయం అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు, నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. కూటమి నాయకుల అండదండలతోనే అక్రమార్జనకు పాల్పడుతున్నారు. నిబంధనలను ఉల్లగించి కొండలను తవ్వేస్తున్నారు. చెరువులను గుల్ల చేస్తున్నారు.

–అడపా కనకరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, కోరుకొండ

అక్రమార్జనకు అడ్డేలేదు



కూటమి నాయకులు చెప్పేవన్నీ నీతి కథలు. చేసేవి మాత్రం తప్పులు. అధికారాన్ని చేపట్టిన 10 నెలలకే అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఆధ్యాత్మిక ప్రాంతమైన కోరుకొండ మండలంలో అవినీతి, అక్రమాలకు అడ్డేలేదు. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు.

– కొండపల్లి దుర్గారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

వీర జవాన్ త్యాగం ఆదర్శం కావాలి



రాజానగరంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, తదితరులు

రాజానగరం: భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్ చేసిన త్యాగం అందరికీ ఆదర్శం కావాలని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మురళీనాయక్‌కి ఘనం నివాళులర్పిస్తూ స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో పార్టీ శ్రేణులతో కలసి బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఆ వీరుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నివ్వాలని కోరుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకే కమిషన్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): భారత రాజ్యాంగం దేశ పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, వాటిని ప్రజలకి అందించడంలో ప్రభుత్వ శాఖలు వివక్ష చూపుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రజలు ఆ హక్కులు పొందేలా జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి చేస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ భారతి సయాని మాట్లాడుతూ ప్రజల విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం పరంగా అందించాల్సిన సేవలు విషయంలో కూడా కమిషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 39 గిరిజన వసతి గృహాలు, ఎస్టీ కాలనీలు, పాఠశాలలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీ చేశామని, వారి సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను సుమోటోగా స్వీకరిస్తామని మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి తెలిపారు. ట్రైబల్ హాస్టళ్లు, ఎస్టీ కాలనీలు, పాఠశాలలు, మండల తహసీల్దార్ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యలు ఉన్న వారు నేరుగా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఫిర్యాదులు చేసుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి, కె.విజయ కుమారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎస్.జ్యోతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఆర్‌సీ సభ్యురాలు విజయభారతికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న విజయకుమారి తదితరులు

మతోన్మాద పాలన దేశానికి ప్రమాదకరం

ప్రకాశం నగర్ : దేశంలో హిందూ మతోన్మాద పాలన రాజ్యమేలుతుందని, ఇది చాలా ప్రమాదకరమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జాతీయ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వనజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ అధికారంలో వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేయడమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయ్యాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆమె ప్రశ్నించారు. భారత దేశం వ్యవసాయ ఆధారిత దేశమని, కాగా మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. పహల్గాం దాడి సంఘటనతో యావత్తు భారతదేశం మోదీకి అండగా నిలిచిందని, అయితే మోదీ సాధించింది ఏమిటాని ప్రశ్నించారు. నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆగస్ట్ 6 7 8 తేదీలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి కొండలరావు , సహాయ కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

గ్రామాల్లో తిరంగా యాత్ర

రాజమహేంద్రవరం రూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన వీర జవాన్లకు మద్దతుగా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈనెల 17, 19, 20వ తేదీల్లో గ్రామ గ్రామాన పార్టీలకతీతంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు బీజేపీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, కోకన్వీనర్ యానాపు యేసులు పిలుపునిచ్చారు. బుధవారం పిడింగొయ్యి గ్రామంలో బీజేపీ నాయకులు కరుటూరి శ్రీనివాసరావు ఇంటి వద్ద బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆకుల శ్రీధర్, యానాపుయేసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించడం కోసం ఈ నెల 17, 19, 20వ తేదీల్లో జాతీయ జెండా చేత పట్టుకుని గ్రామంలో యువత, మాతృమూర్తులు, విద్యార్థులు, ఎక్స్ ఆర్మీ, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో తిరంగ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పన్నాల వెంకటలక్ష్మి, తనుబుద్ది సూర్య భాస్కరరావు, కందుకూరి మనోజ్ కుమార్, పీవీ సుబ్రహ్మణ్యం, వీర బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్

కోరుకొండ: గ్రామాల్లో స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం గుమ్ములూరు హైస్కూల్ హెచ్ఎం గంగాభవానీ, ఉపాధ్యాయుల ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఎం గంగా భవానీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. మీపిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని కోరారు.

మహిళ అదృశ్యం

సీతానగరం: సింగవరానికి చెందిన అంబటి ప్రసన్న కుమార్ తన భార్య ప్రత్యూష కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్యూష(28) తన అమ్మవాళ్ల ఊరికి వెళుతున్నానని ఉదయం 8.45 గంటలకు భర్తతో చెప్పి వెళ్లింది. అయితే భర్త ప్రసన్నకుమార్ ఆరా తీయగా తన భార్య అమ్మ ఉంటున్న ఊరికి వెళ్లలేదని తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

కంబాలచెరువు: స్థానిక అల్లూరి రామలింగయ్య మెడికల్ కళాశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రామనికి శక్తి టీం జిల్లా ఇన్‌చార్జినోడల్ ఆఫీసర్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేవీ సత్యనారాయన దీనికి హాజరై అవగాహన కల్పించారు. మహిళలు శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, ఎవరికైనా ఎటువంటి ఆపద వచ్చినా, ఏ సమయంలోనైనా శక్తి యాప్ ద్వారా పోలీసుల సహాయం కోరవచ్చన్నారు.

డిపాజిట్లు పెంచడంలో సహకరించాలి

రంగంపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రికరింగ్ డిపాజిట్ చేసి లక్ష రూపాయలు మెచ్యూరిటీ పొందాల్సిందిగా స్థానిక డిసిసిబి బ్యాంకు మేనేజర్ షేక్ బషీర్ కోరారు. బుధవారం నాడు మండల కేంద్రమైన రంగంపేటలో ఇంటింటా తిరిగి లబ్ధిదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు, జనరల్ పబ్లిక్‌కు ఆర్డీ ద్వారా పొందే లాభాలను లబ్ధిదారులకు వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు నెలకు రూ.500 కడితే 56 నెలలకు రూ.34,325, రూ.2,500 కడితే 56 నెలలకు రూ.1,71,629, జనరల్ పబ్లిక్ నెలకు రూ.500 కడితే 56 నెలలకు రూ.33,90లు, రూ.2,500 కడితే 56 నెలలకు రూ.1,69,522 మెచ్యూరిటీ మొత్తాన్ని పొందవచ్చునన్నారు. ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి జూన్ నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామని, ఇంటింటా తిరిగి ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికరింగ్ డిపాజిట్లు పెంచడంలో అందరూ సహకరించాలన్నారు. ఇతర వివరాలకు బ్యాంకుకు వచ్చి సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రవిచంద్ర, అనుపమ, దేవి, ఏఎల్‌బీ పంతులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు రికరింగ్ డిపాజిట్లపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ సిబ్బంది

ఉపాధి కల్పించాలని వినతి



రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణనాయక్‌కు సమస్యను వివరిస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు

సీతానగరం: గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చి తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ రఘుదేవపురం ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు ఆర్డీఓ కృష్ణ నాయక్‌కు వినతిపత్రం అందించారు. టీడీపీ నాయకుడు అభిరామ్ ఆధ్వర్యంలో బుధవారం వారు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ప్రక్కిల్లంక లంక భూముల నుంచి ఇసుక తవ్వకాలు జరపడానికి అనుమతులు ఇచ్చారని, ఇసుకను రఘుదేవపురం ర్యాంపు నుంచి ట్రాక్టర్లపై తీసుకువెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుకను డంపింగ్ చేసుందుకు లారీలకు బదులు ట్రాక్టర్లకు అవకాశం కల్పించాలని కోరారు. దీనివల్ల 80 కుటుంబాలు జీవనోపాధి లభిస్తుందని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు మేడసాని రామచంద్రరావు, దాసరి కోటేశ్వరరావు, పరిమి శ్రీను, చిట్టూరి సాయి, ప్రసాద్, అయ్యప్ప, వరప్రసాద్, పరిమి త్రిమూర్తులు ఆర్డీఓ కృష్ణ నాయక్‌కు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

పెదపూడిలో అక్రమ మట్టి తవ్వకాలు

- పాగాడి పంట కాలువకు అడ్డుకట్ట వేసి మట్టి తవ్వకాలు
- జేసీబీ, ట్రాక్టర్ల పట్టుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది
- స్టేషన్‌కు తరలించిన వాహనాలు



పెదపూడిలో పాగాడి పంట కాలువకు అడ్డుకట్ట వేసి లారీపై తరలిస్తున్న మట్టి

పెదపూడి: గ్రామంలో మాచరమ్మ తల్లి ఆలయం సమీపంలో పాగాడి పంట కాలువకు అడ్డుకట్ట వేసి అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. బుధవారం పాగాడి పంట కాలువకు అడ్డుకట్ట వేసి భారీ ఎత్తున సుమారు 40 టన్నుల లారీ, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న నేపథ్యంలో రైతులు అడ్డుకున్నారు. పంట కాలువ గట్టును ధ్వంసం చేసి కాలువకు అడ్డుకట్ట వేయడం ఏమిటంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ పీవీ సీతాపతిరావు విలేరులతో మాట్లాడుతూ పెదపూడలో మాచరమ్మ ఆలయం సమీపంలో అర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న పాగాడి కాలువపై నిబంధనలు ఉల్లంఘించి, అక్రమంగా మట్టి తరలిస్తున్న సమాచారంలో అక్కడకు సిబ్బంది వెళ్లారన్నారు. రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ పట్టుకుని సీజ్ చేసి పోలీస్టేషన్‌కు తరలించామని తెలిపారు. అలాగే మండలంలో మట్టి తవ్వకాలు నిబంధనల ప్రకారం చేపట్టాలని, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ఇరిగేసన్ శాఖ ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ పాగాడి పంట కాలువపై అక్రమంగా అడ్డుకట్ట వేసి మట్టి తరలించడంపై సంబంధిత మట్టి తరలింపు వ్యక్తులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. గతేడాది కూడా ఇదేవిధంగా కొంతమంది పంట కాలువలకు అడ్డుకట్ట వేసి మట్టిని తరలించిన సంఘటనలు ఉన్నాయన్నారు. అలాంటి వాటిపై క్రిమినల్ కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పెదపూడిలో పాగాడి పంట కాలువపై వేసిన అడ్డుకట్ట

గ్రామాల్లో సదుపాయాల కల్పనే లక్ష్యం

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. హుకుంపేట, శాటిలైట్ సిటీ పంచాయతీలలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా, డ్రైనేజీ సిస్టం ప్రణాళికను పటిష్టంగా అమలు పరచవలసిందిగా సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో ఆరా తీశారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్‌సదుపాయం కల్పించడంతో పాటు వంద శాతం కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దీని కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. శివారు కాలనీ వరకు పర్యటించి ఏయే ప్రాంతాలలో డ్రైన్లు, రోడ్లు నిర్మించాలో సమగ్ర నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ (కమిషనర్) మాట్లాడుతూ తన పర్యటనలో డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య సమస్యలను ప్రధానంగా గుర్తించినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్